క్లుప్తంగా

బీఎస్పీ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

మలికిపురం: రాజోలు నియోజకవర్గ బీఎస్పీ నూతన కార్యవర్గ నియామకం జరిగినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూశి జాన్‌మోసే గురువారం తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద జరిగిన దళిత రణభేరి కార్యక్రమంలో ఈ మేరకు నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అధ్యక్షునిగా నల్లి ప్రసాద్‌రావు, ఇన్‌చార్జ్–1 ఆకుమర్తి భూషణం, ఇన్‌చార్జ్–2 గంటా బాలాజీ, ఉపాధ్యక్షుడు మోకా శ్రీనుబాబు, ప్రధాన కార్యదర్శి నల్లి సునీల్, కార్యదర్శి పట్నాల సత్యనారాయణ, కోశాధికారిగా వెంకటేష్‌ను నియమించినట్లు వివరించారు.

వైభవంగా భవానీల కలశ పూజ

ఆలమూరు: దేవీ నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని సంధిపూడిలో భవానీ మాలధారులు నిర్వహించిన కలశ పూజ భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. భవానీ మాలధారులు నెత్తిన కలశాలు ధరించి బాణాసంచా కాల్పుల మధ్య దుర్గాదేవికి గ్రామోత్సవ నిర్వహించారు. గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

గ్రామాల్లో శ్రమదానం

పి.గన్నవరం: బెల్లంపూడి గ్రామంలో సర్పంచ్ బండి మహలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పంచాయతీ సిబ్బందితో కలిసి ఆమె శ్రమదానం చేశారు. చెరువు పరిసరాల్లోని తుప్పలను తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. మహలక్ష్మి ట్రస్టు చైర్మన్ బండి రమేష్, పంచాయతీ కార్యదర్శి కె.భగవాన్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రమైన పి.గన్నవరంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో తుప్పలను తొలగించారు. సర్పంచ్ బొండాడ నాగమణి, పంచాయతీ కార్యదర్శి ఎన్‌వీవీ సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యసాయి వ్రతాలు

అంబాజీపేట: భగవాన్ సత్యసాయి బాబా వారి అవతార శతాబ్ది జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అంబాజీపేట కొర్లపాటివారిపాలెం సత్యసాయి సేవా కేంద్రంలో సామూహిక సత్యసాయి వ్రతాలు గురువారం నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్త, 9 గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ గావించారు. సత్యసాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి 108 మహిళలచే వ్రతాలను చేపట్టారు. 100 మందికి వస్త్రదానం, 9 మంది గర్భిణులకు సీమంతాలు జరిపించారు. సాయంత్రం నాలుగు గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. సేవా మందిరంలో మహా మంగళ హారతి చేపట్టారు. కార్యక్రమంలో అంబాజీపేట సబ్ జోన్ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి కార్మికుడికి గాయాలు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలో హెచ్‌టీ లైన్ విద్యుత్ తీగలు తగిలి భవన నిర్మాణ కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. పోతవరానికి చెందిన జి.శ్రీనివాస్ గురువారం ముంగండ ముత్యాలమ్మ వారి ఆలయం రోడ్డులో భవన నిర్మాణ పనుల్లో భాగంగా డాబా ఎక్కి ఇనుప ఊచలు వంచుతుండగా, అవి పక్కనే ఉన్న తీగలకు తగలడంతో అతడు కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. దీంతో శ్రీనివాస్‌ను అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



బి.సావరంలో కాత్యాయనీగా విజయ కనకదుర్గాదేవి



లలితాదేవిగా కొత్తపేట వాసవీమాత



విశేష అలంకరణలో వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ



పెదపట్నంలంకలో కుష్మాండ అలంకరణలో దుర్గమ్మ



కాత్యాయనిగా తాటికాయవారిపాలెం కనకదుర్గమ్మ

కరుణించమ్మా.. కాత్యాయనీ

- వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- భక్తులతో రద్దీగా ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు

కొత్తపేట: దసరా మహోత్సవాల్లో భాగంగా 4వ రోజు గురువారం మండలంలోని దుర్గాదేవి ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరుణించమ్మా కాత్యాయనీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. స్థానిక బొరుసువారి సావరం విజయ కనకదుర్గాదేవి అమ్మవారిని కాత్యాయనిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మని అర్చకులు, ఆసాదులు విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవిని లలితాదేవిగా అలంకరించారు. మహిళలతో అమ్మవారి అలంకరణ పూజలు, సహస్ర గాజుల పూజ నిర్వహించారు.



అయినవిల్లిలో అన్నపూర్ణాదేవికి కుంకుమ పూజ చేస్తున్న అర్చకులు

కుష్మాండ అలంకరణలో దుర్గమ్మ

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుతీరిన కనకదుర్గమ్మ కూష్మాండ అవతారంలో భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు. పాశర్లపూడి బాడవలో ఉన్న అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు సంతాన లక్ష్మిగా సాక్షాత్కరించారు. మగటపల్లి గాయత్రి త్రిశక్తి పీఠంలో అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. మామిడికుదురు విజయదుర్గమ్మ ఆలయంలో పలు ప్రత్యేక పూజలు జరిగాయి. బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, నగరం, పెదపట్నం, మొగలికుదురు, ఈదరాడ, ఆదుర్రు, కొమరాడ, గోగన్నమఠం తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా కనకదుర్గమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు.

కాత్యాయనిగా అన్నపూర్ణాదేవి

అయినవిల్లి: మండలంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఉన్న అన్నపూర్ణాదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అల్లవరపు అన్నప్ప సోమయాజుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, లక్ష కుంకుమార్చనలు చేశారు. అలాగే ముక్తేశ్వరంలోని ముక్తికాంతమ్మ, తొత్తరమూడి రాజరాజేశ్వరీదేవి, నేదునూరు సర్వమంగళ పార్వతీదేవి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. విలస, సిరిపల్లి, కె.జగన్నాథపురం, మాగం, కొండుకుదురు, ఎస్.మూలపాలెం, పొట్టిలంక, అయినవిల్లిలంక, మడుపల్లి, వెలువలపల్లి, చింతనలంక గ్రామాల్లో శరన్నవరాత్ర వేడుకలను ఘనంగా జరిపారు.



అంబాజీపేటలో శ్యామలాంబను రథంపై ఊరేగిస్తున్న భక్తులు

పి.గన్నవరం: గ్రామ శివారు తాటికాయలవారిపాలెంలో ఉన్న కనకదుర్గమ్మ దేవీ నవరాత్ర మహోత్సవాల సందర్భంగా గురువారం కాత్యాయనీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సాయంతో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. అలాగే స్థానిక ఏజీ రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అంబాజీపేట: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అంబాజీపేట శ్యామలానగర్‌లో ఉన్న శ్రీవీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామిని గురువారం రథంపై గ్రామోత్సవాన్ని భక్త బృందం నిర్వహించారు. అలాగే మాచవరం శివారు కోటీవారి అగ్రహారంలో ఉన్న శ్రీభువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో భువనేశ్వరి అమ్మవారిని కాత్యాయనిగా అలంకరించి ఆలయ అర్చకులు డి.ప్రవీణ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు అలాగే స్థానిక బస్‌స్టేషన్ వద్ద ఉన్న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి



ఆలమూరులో పోస్టర్లు ఆవిష్కస్తున్న ఎంపీడీఓ తదితరులు

ఆలమూరు: దేశంలో పేదరిక నిర్మూలన కోసం, విస్తృతమైన ప్రగతి కోసం సుస్థిరమైన అభివృద్ధిని సాధించాలని ఆలమూరు ఎంపీడీఓ ఏ.రాజు, రావులపాలెం పారా సంస్థ డైరెక్టర్ థామస్ పల్లిదానం అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి– లక్ష్యాలు అనే అంశంపై ఆరోగ్య, అంగన్వాడీ, పంచాయతీరాజ్ ఉద్యోగులు, సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం జరిగింది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన నిబంధనలు, పౌష్టికాహారం, వాతావరణంలో సంభవించే మార్పులు, నాణ్యమైన విద్య, సురక్షిత తాగునీరు, అందరికీ సమన్యాయం అనే అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. అనంతరం పోషకాహార పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే సుస్థిర అభివృద్ధి కోసం అనుసరించాల్సిన విధానాలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. పరిపాలన అధికారి మెహర్ ప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, మహిళా ఆరోగ్య సంరక్షణ కార్యదర్శి పి.జయమణి, కో–ఆర్డినేటర్ జి.చినదుర్గ, పారా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



జొన్నాడలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజాప్రతినిధులు

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లి పాలెం ముత్యాలమ్మ గుడి వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వీర మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడారు. గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరాల్లో ప్రత్యేక సేవలు అందిస్తారని పేర్కొన్నారు. డాక్టర్ జయగాయత్రి మాట్లాడుతూ, ఈ శిబిరాల్లో మహిళ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి దుర్గా కావ్య, డాక్టర్ సత్యదేవి, అంగన్వాడీ సూపర్వైజర్ భారతి, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఆలమూరు: ఇంటికి దీపం ఇల్లాలిగా భావించే నేటి సమాజంలోని పౌరులందరరూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభియాన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లు నేలపూడి లావణ్య, కందిబొట్ల శ్రీనివాసు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలోని ఆలమూరు, నర్శిపూడి గ్రామాల్లో వైద్యాధికారులు ఎస్.లక్ష్మీ స్నేహలత, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో శనివారం స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభియాన్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెచ్‌ఈఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అయినవిల్లి: గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మంగాదేవి అన్నారు. గురువారం నేదునూరులో స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభిమాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, శిశువు ఆరోగ్యంగా ఎదగాలంటే తల్లి ఆరోగ్యం ఉండాలన్నారు. ఆమె గర్భిణుగా ఉన్నప్పుడే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులను పరీక్షించి, వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు ఇందుగుల వెంకట్రామయ్య, కళ్లేపల్లి సుబ్బరాజు తదితరులు ఉన్నారు.

మామిడికుదురు: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి జాన్ లెవీ, పి.గన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి మౌనిక, ఆయుర్వేద డాక్టర్ కె.కనకదుర్గ సూచించారు. ఆరోగ్యవంతమైన మహిళలు– శక్తివంతమైన కుటుంబ కార్యక్రమం గురువారం పెదపట్నంలంక, మగటపల్లి గ్రామాల్లో జరిగాయి. పెదపట్నంలంకలో ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, మగటపల్లిలో సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి శిబిరాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలకు, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల, మల్లవానితోట తదితర గ్రామాలకు సంబంధించి ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకూ సరఫరా నిలిపి వేయనున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పుల్లేటుకుర్రు విద్యార్థులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మింటన్, కోకో, అథ్లెటిక్ పోటీలకు పుల్లేటికుర్రు హైస్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకట్రావు తెలిపారు. ఈనెల 22, 24 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికల్లో బ్యాట్మింటన్‌లో జ్యోతిసాయి పల్లవి, ఎ.రష్మిత, వాలీబాల్‌లో జి.రమా, అక్షితలు ఎంపిక అయ్యారన్నారు. 1500 మీటర్ల పరుగు పందెంలో హర్షవర్ధిని ప్రథమ స్థానం, 3, 4 కిలోమీటర్ల పరుగు పందెం పోటీల్లో తేజస్విని దుర్గాశ్రీ ప్రథమ స్థానం, తేజస్వి 3 కిలోమీటర్ల పరుగు పోటీల్లో ప్రథమ స్థానం సాధించారని హెచ్‌ఎం వివరించారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు అందే సూర్యనారాయణ, దొమ్మేటి ఉదయ భాస్కర్‌ను సర్పంచ్ జిల్లి బాలరాజు, ఎస్ఎంసీ చైర్మన్ నూకల శ్రీరత్నమాల, ఉపాధ్యాయులు అభినందించారు.

క్షతగాత్రునికి ఆర్థిక సాయం



అనపర్తిలో బాధితునికి చెక్కు అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తు భవనంపై పనిచేస్తూ కిందపడిపోయిన భవన నిర్మాణ కార్మికునికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ ఆర్థిక సాయం అందించింది. అనపర్తికి చెందిన వెంగళదాసు శ్రీనివాసు (59) తాపీ పనిచేసుకుటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండు నెలల క్రితం ఒక భవనంపై పనిచేస్తూ ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో కాలు, చేయి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యానికి చాలా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్తోమత లేక అతని కుటుంబసభ్యులు సేవా సంస్థను ఆశ్రయించడంతో వారు సాయం చేశారు. గురువారం సేవా సంస్థ సభ్యులు శ్రీనివాసు ఇంటికి వెళ్లి రూ.13 వేలు చెక్కు రూపంలో అందజేశారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

కొత్తపేట: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ మాజీ అధ్యక్షుడు దీన్‌దయాళ్‌కు కొత్తపేటలో గురువారం ఆయన జయంతి సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు కనకేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఖండ్ ప్రముఖ్ తొగరు ఆంజనేయులు, సేవ పక్వాడ్ మండల కన్వీనర్ కోటిపల్లి దామోదర్, మండల ప్రధాన కార్యదర్శి అన్యం సత్యనారాయణ, మండల నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు: బీజేపీ హైందవ సిద్ధాంత కర్త దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆదర్శనీయుడని బీజేపీ మండల కన్వీనర్ కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు పేర్కొన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పెదపట్నంలంకలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వేగి వెంకటేశ్వరరావు, కొండా రాంబాబు, యేడిద బాబులు పాల్గొన్నారు.



కొత్తపేటలో దీన్‌దయాళ్‌కు నివాళులర్పిస్తున్న పాలూరి జేపీ

వికసిత్ భారత్‌లో యువత భాగస్వామ్యం కావాలి



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఆర్పీ సుభాషిణి

కొత్తపేట: కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్‌లో యువత భాగస్వామ్యం కావాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ విభాగం అధ్యాపకురాలు సుభాషిణి సూచించారు. గురువారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ అనే అంశంపై ఒకరోజు వర్క్ షాపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుభాషిణి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజన్–2047 కార్యక్రమంలో భాగంగా 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఎటువంటి చర్యలు చేపట్టాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ పాపారావు, అధ్యాపకులు శ్రీనివాసులు, అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంఎస్‌జీవై అవగాహన ర్యాలీ

రావులపాలెం: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని గృహ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ అమలాపురం ఈఈ రాంబాబు కోరారు. ఆ మేరకు గురువారం రావులపాలెంలో సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పీఎం సూర్యఘర్ యోజన పథకం కింద ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని వినియోగించుకొని రూఫ్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవటానికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సోలార్ విద్యుత్ వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. 1 కిలో వాట్ సోలార్ సిస్టమ్‌కు రూ.30 వేలు, 2 కిలో వాట్‌కు రూ.60 వేలు, 3 కిలో వాట్‌కు రూ.78 వేలు సబ్సిడీ వస్తుందన్నారు. 1కిలో వాట్ రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్‌కు 100 చదరపు అడుగుల విస్తీర్ణం కావాలని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట డీఈ చిట్టి రాజు, రావులపాలెం ఏఈ నరేష్, నియోజకవర్గంలో అన్ని మండలాల విద్యుత్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రావులపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అమలాపురం ఈఈ రాంబాబు

అధినేతతో ఆత్మీయంగా..

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన నేతలు కలిశారు. కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌కు పార్టీ నేతలను పరిచయం చేశారు. మామిడికుదురు, అంబాజీపేట, అయినవిల్లి, పి.గన్నవరం మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, విత్తనాల ఇంద్రశేఖర్, మేడిశెట్టి శ్రీనివాస్, యన్నాబత్తుల ఆనంద్, ఎంపీపీలు కుసుమ వనజకుమారి శ్రీధర్, దొమ్మేటి వెంకటేశ్వరరావు, మట్టపర్తి నాగ విజయలక్ష్మి, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి తదితర పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో కొందరు కుటుంబసభ్యులతో సహా అధినేతను కలిశారు.

మలికిపురం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ బలోపేతంపై జగన్ మాట్లాడినట్టు ఆయన తెలిపారు.







వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ పి.గన్నవరం కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అంబాజీపేట మండల శాఖ అధ్యక్షుడు శేఖర్, జెడ్పీటీసీ వరలక్ష్మి, ఎంపీపీ విజయలక్ష్మి కుటుంబీకులు











తాడేపల్లిలో జగన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాస్ (అయినవిల్లి), ఆనంద్ (పి.గన్నవరం), రాము (మామిడికుదురు), సీనియర్ నేత కేఎస్ఎన్ రాజు, అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు